76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు దినపత్రికలో పనిచేయుటకు సబ్ ఎడిటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఎడ్వర్టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, రిపోర్టర్‌లు కావలెను అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com


అమరావతి సంపుటి : 4 సంచిక 6, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 29 - ఆదివారం 4 నవంబర్, 2018

వివరాలు2లో...

ఈ తరానికి తెలియని పొట్టి శ్రీరాములు త్యాగం

వివరాలు3లో...


కెరటాలపై ఆధిపత్యం

వివరాలు4లో...


ప్రజల సొమ్ము విగ్రహాల పాలు

వివరాలు4లో...

పవన్‌కు ఛానళ్ల హోరు

# మా గోడూ వినండి.. బాబూ


తిత్లీ తుఫాను ప్రాంతంలో పర్యటిస్తున్న కుమ్మర శాలివాహన సంఘ ప్రతినిధులు ఎస్.పి. నాగేశ్వరరావు, యం.వి.వి.ఎస్.ఎన్ మూర్తి తదితరులు


తీవ్రంగా నష్టపోయిన ఇటుక బట్టీలు

## తిత్లీ దెబ్బకు సర్వం కోల్పోయిన కుమ్మర్లు

**రాజధాని వార్తలు, అమరావతి :** ఒకప్పుడు కుమ్మర్ల పాత్రలకు, కుండలకు విపరీతమైన గిరాకీ ఉండేది. అయితే రాను రాను అల్యూమినియం, స్టీలు పాత్రల వాడకం పెరగడంతోపాటు ఎండాకాలం నీటిని చల్లపరిచే కుండల స్థానంలో ఫ్రిడ్జ్‌ల వాడకం పెరగడంతో కుమ్మర్లకు పూట గడవడం గగన మైంది. ఈ పరిస్థితుల్లో వారు ఇటుకల తయారీలో ప్రవేశించి, ఆధునిక పరికరాలు ఉపయోగించి ఒక పరిశ్రమగా రూపొందించుకుని నిర్మాణ రంగంలో కాలుమోపారు. అయితే అక్కడ కూడా వారిని విధి వెక్కిరిస్తూనే ఉంది. ఇటీవల సంభవించిన తిత్లీ తుపానుతో శ్రీకాకుళంలోని 9 మండలాల్లోని 30 గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన వారిని కుమ్మరి, శాలివాహన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ,అసోసియేట్ అధ్యక్షుడు వారిని పరామర్శించగా, రాజకీయ నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. దీంతో వారి వద్ద నుంచి విజ్ఞాపనలు, నష్టం అంచనాలను సేకరించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం కోసం ప్రయత్నం చేస్తున్నారు.

బాధితులకు బాసటగా కులసంఘం నాయకులు,స్థానిక ఎమ్మెల్యేకు తమ బాధలు విన్నవించుకుంటే మీ బాధలు మీరు పడండి అంటూ విరుచుకుపడ్డారని కుమ్మర్లు వాపోయారు. దీనిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ బెజవాడ ఆదిశేషయ్య, సంఘం గౌరవాధ్యక్షులు శ్రీ ఎస్ పద్మ నాగేశ్వరరావు, రాష్ట్ర అశోసియేట్ అధ్యక్షులు డా॥ ఎమ్.వి.వి.ఎస్.ఎన్ మూర్తి, మిగతారాష్ట్ర నాయకులు నిరసన వ్యక్తం చేశారు. 9 మండలాలైన నర్సన్నపేట, సోంపేట, పలాస,పాతపట్నం, వజ్రపుకొత్తూరు, మిలియాపూర్తు, పోలాకి, కిరా, జనుమూరు మండలాల్లో 30 గ్రామాలలో సుమారుగా 2,000 కుటుంబాలు కుమ్మర మట్టి కార్మికులు ఈ తిత్లీ తుఫానులో రూ.12 కోట్ల ఆస్తిని నష్టపోయారని వారు వెల్లడించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని ఆదుకోవాలని నాయకులు డిమాండు చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు అనే ఆయుధముతో అతనికి ఒక గుణపాఠం చెప్పాలని నిర్ణయించామని నాయకులు స్పష్టం చేశారు.



తుఫాను వల్ల నాశనమైన ఇటుక బట్టీలు


సహాయం కోసం బాధితులు నమోదు చేసుకున్న దరఖాస్తు


కూలిన ఇళ్లు


## రసవత్తరంగా మంగళగిరి రాజకీయం

- వైసీపీలో నేనే పోటీచేస్తానంటున్న ఆర్కే
- టీడీపీ నుంచి చిరంజీవికి దక్కేనా!




**రాజధాని వార్తలు, ప్రత్యేక ప్రతినిధి :** రాజధానిలో అంతర్భాగమైన, కీలకమైన నియోజకవర్గంగా ఈసారి మంగళగిరి అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా తయారు కానుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మళ్ళీ మళ్ళీ తానే పోటీ చేయబోతున్నానని ఇప్పటికే ప్రకటించారు. ఒక దశలో ఇక్కడినుంచి చేనేత ప్రతినిధిని నిలబెట్టాలని వైసీపీ ఆలోచించింది. అయితే అంగబలం, అర్థబలం గల అభ్యర్థి దొరకకపోవడంతో మళ్లీ ఆర్కేనే రంగంలోకి దిగారు. గత నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గానికి ఏమీ చేయలేకపోయారు అన్న విమర్శ ఆర్కే ఎదుర్కొంటున్నారు. అయితే రాష్ట్రస్థాయిలో వైసిపి పక్షాన అవినీతిని ఎండగట్టడం లో ప్రముఖ పాత్ర వహించడం తనకు గర్వకారణమని ఆర్కే భావిస్తున్నారు. జిల్లాస్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో అధికారులను అధికార పార్టీని పరోక్షంగా బెదిరించడం వల్ల వారు ఎవరూ తనకు సహకరించడం లేదని ఆర్కే అంటున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత జగన్ మాట్లాడుతుంటే మైక్ కట్ చేసిన అధికార పార్టీ రాజధాని పరిధిలో తన గొంతును వినిపించేందుకు అన్ని విధాలా అడ్డుపడిందని ఆ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేసిందని ఆర్కే ఆరోపిస్తున్నారు . ప్రజలు దీనిని అర్థం చేసుకుంటారు అన్న అభిప్రాయం ఆర్కే వ్యక్తం చేస్తున్నారు. ఇందులోని నిజానిజాలను ప్రక్కన పెడితే ఆర్కేకి కొంత సానుకూలత ఈ నియోజకవర్గంలో కనబడుతుంది. ప్రజల కోసం తన సొమ్మును ఖర్చు పెట్టాను గాని ప్రజల సొమ్మును తినలేదు అన్న గట్టి అభిప్రాయం ఆర్కేకి ఉంది. అయితే ఎక్కువ సమయం నియోజకవర్గంలో గడప లేదన్న విమర్శ కూడా ఉంది. నాన్ లోకల్ గా ఉండడం ఆయనకు మైనస్. ఈసారి ఎన్నికలలో ఈ విమర్శను ఎలా ఎదుర్కొంటాడో అన్నది వేచి చూడాలి. ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే 12 ఓట్ల తేడాతో ఓడిపోయిన టిడిపి అభ్యర్థి గంజి చిరంజీవి ఉత్సాహంగా పార్టీ పనులలో పాల్గొంటున్నారు. గత నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గ ఇన్చార్జిగా, మంగళగిరి మున్సిపల్ చైర్మన్ గా రెండు పాత్రలను పోషిస్తున్నారు. ఈ జోడు గుర్రాల స్వారీ తనకు ఓ విధంగా మైనస్ అయింది. పదవులు దక్కని సీనియర్ నాయకులకు ఈ రెండు పదవుల వ్యవహారం కంటగింపుగా ఉంది. అయితే చేనేత ప్రతినిధిగా ఉన్న తనకు పార్టీ అన్యాయం చేయదని గట్టి నమ్మకంతో చిరంజీవి ఉన్నారు. అదే స్థాయిలో ఈయన మీద స్వపక్షం నుంచి రోజువారీ ఫిర్యాదులు పార్టీ పెద్దలకు చేరవేయడం కూడా జరుగుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుండి ఎటువంటి నేపథ్యం లేకుండా సరాసరి టీడీపీ ఎమ్మెల్యే టికెట్ పొందిన అదృష్టవంతుడు చిరంజీవి. అయితే ఈసారి చిరంజీవి కి టిక్కెట్ రాదన్న ప్రచారం బాగా జరుగుతోంది. ఎందుకంటే చిరంజీవి చేసిన తప్పులు గానీ లేకుంటే సుప్రీంకోర్టు స్థాయికి సీఎం చంద్రబాబును లాక్కెళ్ళి వేధించిన ఆర్ కె ఎట్టి పరిస్థితుల్లో ఈసారి ఎమ్మెల్యే కాకూడదు అన్న గట్టి అభిప్రాయం టిడిపి అధిష్టానంలో ఉందని భోగట్టా. అందుకోసమే చిరంజీవి ని పక్కన పెట్టి అన్ని విధాలా సమర్థుడైన ఓసి అభ్యర్థిని రంగంలోకి దించాలన్న ఆలోచన ఉన్నట్లుగా సమాచారం. అవసరమైతే సీఎం కుటుంబ సభ్యులు గాని లేదా బలమైన ఎన్నారై అభ్యర్థిని గాని రంగంలోకి దించే ఆలోచన ఉంది. ఒకవేళ ఈ ఆలోచన పక్కన పెడితే చేనేత ప్రతినిధి కే ఇవ్వాల్సివస్తే చిరంజీవిని తప్పించి బయట నుంచి అయినా బీసీ అభ్యర్థిని నిలబెట్టే ఆలోచన ఉన్నట్లుగా సమాచారం. ఇదే జరిగితే ఇక్కడి చేనేత వర్గీయుల ఆదరణకు టిడిపి దూరమవుతుందని వైసిపి ఆశలు పెంచుకుంటుంది. ఇక వామపక్షాలు, జనసేన, బీజేపీ ల విషయానికి వస్తే అందరూ ఇక్కడి సీటు కోసం ముందుగానే కర్చీఫ్ లు వేస్తున్నారు. వామపక్షాలతో జనసేన పొత్తు ఇంకా ఖరారు కాలేదు. అవుతుందో లేదో కూడా చెప్పలేం. ఈ పరిస్థితుల్లో సిపిఎం, సిపిఐ వేర్వేరుగానే పోటీచేసే ఆనవాయితీ ఈ నియోజకవర్గంలో ఉంది. బీజేపీ ఇప్పటికే పోటీ చేసేందుకు సిద్ధపడుతోంది. జనసేన అభ్యర్థులు కూడా రంగంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో ఈసారి బహుముఖ పోటీ తప్పదేమో అనిపిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ తదితర కుటుంబ సభ్యులు మంగళగిరి నియోజకవర్గంలో ఓటు రాయించుకున్నారు. అంటే తమ సొంత నియోజకవర్గం గా దీనిని భావిస్తున్నారు. అలాంటప్పుడు తమ స్థాయికి తగిన అభ్యర్థిని మంగళగిరి లో నిలబెడతారు అన్న గట్టి అభిప్రాయం ఈ నియోజకవర్గంలో వినబడుతుంది. ఈ సస్పెన్స్ వీడాలంటే ఇంకా కొన్ని రోజులు ఆగాల్సిందే.

# అక్కరకు మేము..
# అందలం ఇంకొకరికి



**రాజధాని వార్తలు విజయవాడ :** ఇటీవల జనసేన పార్టీలోకి నాదెండ్ల మనోహర్ చేరారు. నాదెండ్ల భాస్కర్ రావు తనయుడిగా కాంగ్రెస్ పార్టీ నుండి తెనాలి నుంచి 2 సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు. అసెంబ్లీ స్పీకర్‌గా (ఉమ్మడి ఏపీ) 2011 నుండి 2014 వరకు పని చేశారు. 2014లో కాంగ్రెస్ తరపున ఓడిపోయారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండి అక్టోబరు 12న జనసేన పార్టీలో చేరారు. తనకు సోదరుడి లాంటి వారని జనసేన అధినేత పవన్ పేర్కొనటం, ఆయనకే కీలక భాధ్యతలు అప్పగిస్తానని ప్రచారం జరిగింది. ఇటీవల అధినేత పవన్‌తో తిత్లీ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మనోహర్ పర్యటించటం, ఏ నాయకుడికి దక్కని గౌరవం, పార్టీలో ప్రాధాన్యత, పవన్‌తో సాన్నిహిత్యం కేవలం నాదెండ్ల మనోహర్‌కు మాత్రమే ఎందుకు దక్కుతొందని కార్యకర్తలు, ఎప్పటినుంచో పార్టీకోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులు వాపోతున్నారు. పార్టీలో చేరిన నాటి నుండి పవన్ తన పక్కనే మనోహర్‌ను తాను ఎక్కడికి వెళ్తే అక్కడకు తీసుక్లెడం పార్టీలోని సీనియర్ నాయకులకు నచ్చని విషయం. ఇటీవల భారీగా జరిగిన కవాతు సభలో కూడా నాదెండ్లను పవన్ ప్రక్కన ఉంచడం కార్యకర్తలకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సూచనలు, సలహాలు తీసుకొవచ్చుకాని ఎప్పటి నుంచో పని చేస్తోన్న సలహాదారులు, రాజకీయ విశ్లేషకులు, నాయకులు మాత్రం ఈ విషయంలో ఒకింత అలకగా ఉన్నారు. ఏదైమైనా పవన్ జాగరుకతతో రాజకీయ నిర్వహణ, సంక్షోభ నిర్వహణ, పార్టీ ప్రజల నిర్వహణ, ఎన్నికల నిర్వహణ కమిటీలు వేసి సమన్యాయం అందరికి చేస్తే బాగుంటుందని కార్యకర్తల ఆకాంక్షిస్తున్నారు. తద్వారా రాజ్యాధికారం అందరికీ చేరువుతుందని ఒకల్లిద్దరని పైనవేసుకుని తిరగటం సరికాదని సీనియర్ నేత భావిస్తున్నారని కార్యకర్తలు తెలుపుతున్నారు.


అప్పటి జిల్లా కలెక్టరు శ్రీ ముద్దాడ రవిచంద్ర గారి ని సత్కరిస్తూ


శిక్షణలో భాగంగా విద్యార్థినులకు ఆచరణాత్మక భోదన

## స్ఫూర్తి బాట

ఆర్థిక పరిస్థితులు లేదా కుటుంబ పరమైన సమస్యల కారణంగా మధ్యలోనే చదువు ఆపేసిన గ్రామీణుల ఉపాధికి బాట వేసే లక్ష్యంతో కదులుతోంది ఆ సెల్. సాదారణంగా బిజీ జీవితంలో చాలా ఇళ్లలో వృద్ధులకు ఆసరాగా నిలిచేందుకు కుటుంబ సభ్యులకు వీలు కావడంలేదు. ఆ కారణంగా విధి లేని పరిస్థితుల్లో వారిని వృద్ధాశ్రమములో చేర్పించవలసి వస్తోంది. అలాంటి వారికి సాయంగా ఉంటూ వారి చిన్న చిన్న వైద్య అవసరాలను కూడా తీర్చేందుకు తగిన శిక్షణను అలాంటి యువతకు ఇస్తే వారికి ఉపాధి కల్పించినట్లవుతుందనే ఉద్దేశ్యంతో స్ఫూర్తి ఆవిర్భవించింది.

ప్రభుత్వం మరియు దాతల సహకారంతోనూ వారి సొంత నిధులతోనూ స్ఫూర్తి వారు గ్రామీణ యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణ నిస్తూ దాని ద్వారా ఇంట్లో పెద్దవారిని చూసుకునేందుకు బెడ్ సైడ్ అసిస్టెంట్‌ల కొరత తీరుస్తున్నారు.

ఈ శిక్షణ కనీసం 7 వ తరగతి పైబడి చదువుకున్న మరియు వితంతువులు, ఏ ఆధారం లేని మహిళలకు ఆదాయ వనరులతో పాటు గౌరవ ప్రదమైన ఉపాధి అవుతుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ముసునూరి సూర్యనారాయణ మూర్తి అన్నారు. 2009 నుండి ఇండియన్ రెడ్‌క్రాస్ వారి ద్వారానూ మరియు వివిధ ప్రైవేటు సంస్థల ద్వారాను నెలకు సుమారు10 వేల వేతనంతో ఉచిత భోజన వసతితో కూడిన ఉపాధి కల్పిస్తున్నారు. మహిళలకు నైపుణ్యం పెంపొందించడం ద్వారా ఉపాదిని అందించడంతో పాటు, డిమెన్షియా, పక్షపాతం వచ్చిన వృద్ధులకు వారి అవసరతలకు తగిన విధంగా చూసుకోవడం నేర్పబడుతుందని ఆయన అన్నారు.

**శిక్షణ ఇలా !**

45 రోజుల శిక్షణలో భాగంగా వీరికి ప్రాథమిక చికిత్సా విధానం, ఇన్సులిన్ ఇవ్వడం, బి.పి. షుగర్ చూడడంతో పాటు, వృద్ధుల సంరక్షణకు అవసరమైన విధానాలపై నిష్ణాతులైన బృందంచే తర్ఫీదునిస్తారు.

**వీరి సేవలు పొందాలంటే !**

వృద్ధుల సంరక్షణకొరకు వీరి సేవలు పొందాలంటే 9492298122 మరియు 9121815891 నందు సంప్రదించగలరు.

www.spoorthyngo.org,spoorthycel@gmail.com


మాన్యశ్రీ చంద్రబాబు నాయుడు గారు పుస్తక ఆవిష్కరణలో అమరావతి వెల్ఫేర్ కౌన్సిల్ చైర్మన్‌తో ...

# ఈ తరానికి తెలియని పొట్టి శ్రీరాములు త్యాగం

**దేశంలోనే మొదటిసారి భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు గురించి ఈ తరాని తెలియదు. తెలంగాణ పేరుతో ప్రాంతీయతత్వాన్ని ఎగదోసిన కేసీఆర్ గురించే రాష్ట్ర ప్రజలకు తెలుసు. అయితే తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు,గౌరవం కోసం పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ అనుసరించిన అహింసామార్గంలో ఉద్యమం చేపట్టారు.**





'1912వ సంవత్సరం నాటికే ద్రవిడుల అభివృద్ధి నీడలో ఆంధ్రులు, మిగతా కనిపించట్లేదని తెలుగు నాయకులు, పత్రికలు ఫిర్యాదులు చేస్తూ.. ఈ ఇబ్బందులకు పరిష్కారం ప్రత్యేక ప్రావినెన్స్ ఏర్పాటేనన్నారు. అయితే అప్పటికి మద్రాసు నగరం ప్రధానాంశం కాదు. 1940ల నాటికి పరిస్థితి మారింది. విశాఖపట్నంలో (బహుశా 1941 నవంబర్‌లో) జరిగిన మహాసభలో టంగుటూరి ప్రకాశం మాట్లాడుతూ.. "మద్రాసు ప్రావిన్సు కేబినెట్ కొన్ని నెలల కిందట సమావేశమై, ఆంధ్రా ప్రావిన్సు ఏర్పాటుపై చర్చించిందన్నారు. ఈ సమావేశానికి అప్పటి గవర్నర్ ఎర్స్కిన్‌ను కూడా ఆహ్వానించారు. ఆంధ్ర, మద్రాసు ప్రావిన్సులు రెండూ నగరం (మద్రాసు)లోనే ఉంటాయని ఆయన సూచించారు. దీనికి తమిళ మంత్రులు సహా అందరూ అంగీకరించారు. తదనంతర పరిణామాల్లో ఆంధ్ర ఏర్పాటైతే మద్రాసు వీధుల్లో రక్తం పారుతుంది' అని ఎర్స్కిన్ బ్రిటీష్ ప్రభుత్వాన్ని హెచ్చరించడంతో ఆంధ్రులు మద్రాసును కోల్పోయారు.

**శ్రీరాములు జీవిత విశేషాలు**

చెన్నైలోని జార్జిటౌన్, అన్నాపిళ్లై వీధిలోని 163వ నెంబరు ఇంటిలో 1901 మార్చి 16వ తేదీన పొట్టిశ్రీరాములు పుట్టారు. తండ్రి గురవయ్య, తల్లి మహాలక్ష్మమ్మ. శ్రీరాములు పూర్వీకుల స్వస్థలం ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలోని పడమటిపల్లె గ్రామం. అప్పట్లో కనిగిరి, పడమటిపల్లి.. నెల్లూరు జిల్లాలో ఉండేవి. శ్రీరాములు ఫిఫ్త్ ఫార్మ్ వరకు మద్రాసులో చదివారు. అది పూర్తి కాలేదు. దీంతో బొంబాయిలోని విక్టోరియా జూబిలీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి 1924లో శానిటరీ ఇంజనీరింగ్, ప్లంబింగ్‌లో డిప్లమో చేసి,గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే (ప్రస్తుత సెంట్రల్ రైల్వే)లో అసిస్టెంట్ ప్లంబర్‌గా ఉద్యోగం పొందారు.

శ్రీరాములు తల్లి మహాలక్ష్మమ్మ 1928లో చనిపోగా, భార్య సీతమ్మ ఒక మగ పిల్లాడికి జన్మనిచ్చింది. కానీ, ఆ పిల్లాడు ఐదు రోజులకే చనిపోయాడు. తర్వాత కొద్ది రోజులకు క్షయ రోగంతో సీతమ్మ మరణించింది.అప్పటికే గాంధీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడైన శ్రీరాములు తన ఉద్యోగానికి రాజీనామా చేసి.. గాంధీ అనుమతితో 1930 ఏప్రిల్‌లో సబర్మతి ఆశ్రయంలో చేరారు.వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు.ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. 1952 అక్టోబర్ 19 నుంచి డిసెంబర్ 15 వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.మొదటి రోజు 53 కేజీల బరువు ఉండగా, చివరి రోజు 38 కేజీలకు చేరుకున్నారు.దీక్షా కాలంలో శ్రీరాములు పాటించిన దిన చర్యను డాక్టర్ కస్తూరి నారాయణ మూర్తి, డాక్టర్ అవధాని, డాక్టర్ శాస్త్రి తదితరులు పర్యవేక్షించేవారు. గాంధీజీ తన నిరశన వ్రతాల్లో పాటించిన నియమాలనే శ్రీరాములు కూడా అనుసరించారు.

డిసెంబర్ 16న ఆయన పార్థీవ దేహాన్ని రెండెడ్ల బండి మీద కట్టిన రథంపై శ్రీరాములు అంతిమ యాత్ర జరిగింది. కన్యకాపరమేశ్వరి దేవస్థానం వారు నిర్మించిన.. మాశైలోని ఆర్యవైశ్య శ్మశానంలో అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా పక్కనే ఉన్న ఒక పెంకుటిల్లు వరండాలో ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి తదితరులు శ్రీరాములు గురించి ప్రసంగించారు. **"గాంధీజీ తుపాకీ గుండుకు అసువులు కోల్పోగా, ఆయన బోధించిన సత్యం, అహింసల కోసం శ్రీరాములు ఆత్మ బలిదానం చేశాడు"** అని ప్రకాశం పంతులు అన్నారు.

మద్రాసు లేకుండా ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19న లోక్‌సభలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు.

**1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. తదనంతర పరిమాణాల్లో హైదరాబాదుతో కూడిన ఆంధ్రప్రదేశ్ నవంబరు 1న ఏర్పడింది. 2014 జూన్ 2న ఏర్పడిన కొత్తరాష్ట్రం తెలంగాణ కాబట్టి, ఎప్పటిలా నవంబరు మొదటిన రాష్ట్ర ఏర్పాటును నిర్వహించుకోవాలని అనేక పార్టీలు కోరినప్పటికీ ఏపీ సీఎం పట్టించుకోలేదు. దాంతో శ్రీరామలు త్యాగం క్రమంగా మరుగైపోతోంది.**

2008 మే 22 న నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

– బోస్

# రాజధాని వార్తలు
కలం

## హుందాతనం కావాలి

రాష్ట్ర రాజకీయాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. ఈనెల 25న ప్రతిపక్ష నాయకుడు, వైసీపీ అధినేతపై హత్యాయత్నం జరిగింది. దానిని అందరూ ముక్త కంఠంతో ఖండించారు. అందులో అధికార పక్ష నేతలు కూడా ఉన్నారు. ఇదంతా ఆహ్వానించ తగ్గ పరిణామం. అయితే ఆతర్వాత చోటు చేసుకున్న పరిణామాలు అధిక్షేపణీయంగా మారిపోయాయి. ఇలాంటి ఘటనలకు పాల్పడినవారిని ఎంతమాత్రం సహించబోమని, కఠినంగా శిక్షిస్తామని చెప్పాల్సిన డీజీపీ, తన స్థాయిని తగ్గించుకొని ఇదంతా పబ్లిసిటీ స్టంటని ఘటన జరిగిన రెండు గంటల్లోనే తేల్చిచెప్పడంపై ఆయనే ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఎందుకంటే తన కింద పనిచేసే వేలమంది పోలీసులకు ఒత్తిడులకు తలొంచకండి.. నిష్పక్షపాతంగా వ్యవహరించండి.. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయండి అని ప్రభోదించాల్సిన రాష్ట్ర అత్యున్నత అధికారి అలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సింది. అసలే ఒకవైపు రాజకీయాలు నానాటికి అద:పాతాళానికి చేరుకొని ప్రజలు అసహ్యించుకుంటున్న సమయంలో పోలీసులు ప్రజలకు భరోసా కల్పించాల్సింది పోయి ఏకపక్షంగా వ్యవహరించడం తగదు.. రాష్ట్రంలోని పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయి.. పోతాయి... అయితే పాతిక ,ముప్పై ఏళ్లు అధికారులు, ఉద్యోగులు ప్రజలకు సేవలందిస్తారు. అది గుర్తెరిగి ప్రవర్తించాలి.

రాజకీయ నాయకులకు చుట్టుముడుతున్న వివాదాలు, పెరుగుతున్న ఒత్తిడి సమయంలోనే వారెంటో ప్రజలు అంచనా వేస్తారని మరచిపోకూడదు.. ప్రతిపక్ష నాయకుడిపై దాడి చేసిన శ్రీనివాసరావు ఆయన అభిమానే దాడి చేశాడంటూ తేలిగ్గా కొట్టిపారేశారు. కాదని వైసీపీ నెత్తీనోరు కొట్టుకుంటున్న విషయం పక్కన పెట్టినా, దాడి చేసింది ఎవరైనా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని మర్చిపోరాదు. గవర్నర్ ఏం జరిగిందని డీజీపీని అడిగినా, తెలంగాణా సీఎం, కేటీఆర్, ఎంపీ కవిత జగన్‌ను పరామర్శించినా, కేంద్ర మంత్రి సురేష్ ప్రభు విషయాన్ని అడిగినా.. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ దాడిని ఖండించినా, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకంత అసహనాన్ని ప్రదర్శిస్తోంది.? వాస్తవానికి వారందరికీ ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి లోకేష్, హెూం శాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఫోన్‌చేసి ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, త్వరలో ఈ కుట్రను ఛేదిస్తామని వివరించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి హుందాతనంగా ఉండేది. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితానికి దేశవ్యాప్తంగా గుర్తింపు,గౌరవం లభించి ఉండేది. అందివచ్చిన అవకాశాన్ని అధికార తెలుగుదేశం చేజేతులా నాశనం చేసుకోవడమే కాకుండా, శత్రువులను పెంచుకుంది. ఇప్పటికైనా అధికారపార్టీ ఈ విషయంపై పునరాలోచించడం చాలా అవసరం.

తిత్లీ విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది, వారికి చేయూత నివ్వడంలో వెనుకబడింది.1999లో సంభవించిన భయంకర తుపాను నుంచి ఒడిశా ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ముందుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క శ్రీకాకుళం జిల్లాకే తుఫాను పరిమితంకాగ, ఒడిశాలో మూడు జిల్లాల్లో తుపాను విరుచుకు పడింది. అయినప్పటికీ అక్కడ అధికారులు, విపత్తు నిర్వహణా శాఖ ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు, బాధితులకు సకాలంలో నిత్యావసర వస్తువులు అందించడంలో ముందున్నాయి. తుపాను తగ్గిన మరునాడే ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఇళ్లు కూలిన వారికి టార్పాలిన్లు, నిత్యావసర సరుకుల కోసం రూ.1000 బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది. మరో రెండు వేల డిపాజిట్‌కు ప్రభుత్వం హామీ ఇచ్చింది. మన రాష్ట్ర ప్రభుత్వం 25 కేజీల బియ్యం, కిలో నూనె, కందిపప్పు, బంగాళాదుంపలు,పంచదార అరకిలో, లీటరు నీరు సరఫరా చేసింది. బియ్యం మినహా మిగతావాటి రూ.220 ఉంటుందని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికీ టార్పాలిన్లు, సోలార్ లాంతర్లు, కొవ్వొత్తులు అందించకపోవడంతో బాధితులు నానా అగచాట్లు పడుతున్నారు. అదే విధంగా గతనెల్లో మావోయిస్టు చేతుల్లో అసువుల బాసిన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబాలకు అందించాల్సిన పరిహారం ఫైలు ఇప్పటికరకు కదలలేదు.. సుపరిపాలన, పారదర్శకత ఉంటే ప్రజలు అధికార పార్టీని ఆదరిస్తారు. అంతేకాని కేవలం ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోయడం ద్వారా వచ్చేది శూన్యం..

## 8 నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు


**రాజధాని వార్తలు, విజయవాడ (ఇంద్రకీలాద్రి) :** ఇంద్రకీలాద్రిపై నవంబరు 8 నుంచి డిసెంబరు 7 వరకు కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం వైదిక కమిటీ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపింది. కార్తీక మాసంలో దుర్గగుడి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, నటరాజస్వామి ఆలయంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కాటక పారాయణలు, లక్ష్మీగణపతి పంచాక్షరి మంత్రాలను అర్చకులు పఠిస్తారు. నవంబరు 9న జగన్మాత దుర్గమ్మకు కోటి గాజుల అలంకరణ చేస్తారు. 11న నాగుల చవితిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. మల్లేశ్వరాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సహస్ర లింగార్చన, దుర్గగుడి అంతరాలయంలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, 10 నుంచి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు త్రికాల అభిషేకాలు నిర్వహిస్తారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు మహానివేదన సమర్పిస్తారు. మల్లికార్జున మహా మండపం ఏడో అంతస్తునందు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం చేస్తారు. నవంబరు 22న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మల్లేశ్వరాలయంలో జ్వాలాతోరణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

మల్లేశ్వరాలయంలో లక్ష బిళ్వార్చన.. కార్తీక మసాన్ని పురస్కరించుకొని మల్లేశ్వరాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 గంటల వరకు లక్ష బిళ్వార్చన నిర్వహిస్తారు. నవంబరు 12, 19, 23, 26, డిసెంబరు 3, 5న లక్ష బిళ్వార్చన ఉంటుందని వైదిక కమిటీ సభ్యులు తెలిపారు. 19 నుంచి భవానీ దీక్షలు ప్రారంభం.. నవంబరు 19 నుంచి 23వ తేదీ వరకు భవానీ మండల దీక్షలు ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 13 వరకు అర్ధ మండల దీక్ష తీసుకోవచ్చుని వైదిక కమిటీ తెలిపింది. డిసెంబరు 22న సాయంత్రం 6 గంటలకు విజయవాడ సత్యనారాయణపురంలోని శివరామకృష? క్షేత్రం నుంచి భవానీ దీక్షాధారుల కలశజ్యోతి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. డిసెంబరు 29 నుంచి 2019 జనవరి 2 వరకు భవానీ దీక్షల విరమణ ఉంటుందని చెప్పారు. జనవరి 2న పూర్ణాహుతితో దీక్షల విరమణ క్రతువు ముగుస్తుందన్నారు.




ప్రతిభకి పేదరికం అడ్డు కాదు, సృజనాత్మకతకు స్థాయితో పని లేదు. అని నిరూపించారు ఈ చిన్నారులు. గుంటూరు జిల్లాలోని యనమదల గ్రామంలో కనిపించిన దృశ్యమిది.

## అగ్రిగోల్డ్ ప్రతిపాదనకు హైకోర్టు నో



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** సంస్థ ఆస్తులను తామే అమ్మి ఖాతాదారులకు డబ్బులు చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలన్న అగ్రిగోల్డ్ యాజమాన్యం తాజా ప్రతిపాదనను హైకోర్టు తోసిపుచ్చింది. అగ్రిగోల్డ్ కేసుపై హైకోర్టుమరోసారి విచారణ చేపట్టింది. ప్రధానంగా హాయ్‌ల్యాండ్ విలువను రూ.503 కోట్లుగా నిర్ధారిస్తూ ఎస్‌బీఐ అధికారులు హైకోర్టుకు సమర్పించారు. దీంతో జీఎస్సెల్ గ్రూప్ గతంలో హాయ్‌ల్యాండ్ విలువను ఏ మేరకు నిర్ధారించిందో తెలపాలని అధికారులను హైకోర్టు కోరింది. అంతేకాకుండా దీని విక్రయానికి సంబంధించి ఇంకెవరైనా బిడ్డర్లు ఉంటే వారి వివరాలను పేర్కొనాలని సూచించింది. అయితే హాయ్‌ల్యాండ్ కొనుగోలుపై అగ్రిగోల్డ్ యాజమాన్యం కూడా అఫిడవిట్ దాఖలు చేసింది. ఆస్తులన్నీ తామే విక్రయించేందుకు అనుమతినివ్వాలని, విక్రయిం చాక నాలుగేళ్లలో అంటే 2020 నాటికి రూ.8,500 కోట్లు తామే చెల్లిస్తామని తాజా ప్రతిపాదనలతో ముందుకు రాగా వారి ప్రతిపాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. మూడేళ్లుగా విచారణ జరుగుతుంటే సహకరించకుండా మళ్లీ తామే విక్రయించి ఇస్తామనడం సమంజసంగా లేదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్రిగోల్డ్ ఆస్తులు ఇంకెక్కడైనా ఉన్నాయా అనేది గుర్తించాలని గతంలో ఆంధ్రప్రదేశ్ సీఐడీ, తెలంగాణ సీఐడీలను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు కొంత మేర ఆ వివరాలను సమర్పించారు. పూర్తిస్థాయిలో వివరాలు సమర్పించేందుకు ఇంకొంత గడువు కావాలని కోరాగా తదుపరి విచారణను నవంబర్ 9వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అగ్రిగోల్డ్ కస్టమర్ల, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ బాధితులకు న్యాయం చేయాలని వివిధ రూపాల్లో పోరాటం సాగిస్తున్న విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, చత్తీస్‌గడ్ వంటి రాష్ట్రాల్లో లక్షలాది మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారు.



అట్ల తద్దిని పురస్కరించుకుని రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో ఉయ్యాల ఊగుతున్న మహిళలు

## హజ్‌యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం




**రాజధాని వార్తలు, అమరావతి :** హజ్‌యాత్రకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏపీ స్టేట్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పేర్కొన్నారు. విజయవాడలో హజ్ సొసైటీల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపడానికి నవంబరు 17వతేదీ వరకు గడువు పెంచినట్లు వెల్లడించారు. హజ్‌కమిటీ ద్వారా కేవలం ఒక్క పర్యాయం మాత్రమే హజ్ యాత్రకు వెళ్లవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకునే వారి పాస్‌పోర్టు గడువు జనవరి 31, 2020 వరకు ఉండాలన్నారు. 70 ఏళ్లు వయస్సు పైబడినవారు రిజర్వు కేటగిరీ కిందకి వస్తారని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఏపీ స్టేట్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా హజ్ సొసైటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయని వెల్లడించారు.

## బోర్డు తిప్పేసిన మెడికల్ కోచింగ్ సంస్థ..

**రాజధాని వార్తలు, విజయవాడ :** వైద్యవిద్యపై మధ్యతరగతి కుటుంబాలకు ఎంత వ్యామోహం ఉందో తెలిసిన చాలా కార్పొరేట్ సంస్థలు వారిని దోచుకు తింటున్నాయి. దీని కోవలేనే నగరంలోని మరొక సంస్థ 'నేషనల్ మెడికల్ అకాడమీ' కూడా చేరింది. ఎంబీబీఎస్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని నకిలీ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వారి నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసి ఉడాయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెల్లూరు జిల్లాకు చెందిన రమణారెడ్డి 3 నెలల క్రితం విజయవాడలో 'నేషనల్ మెడికల్ అకాడమీ' పేరిట కోచింగ్ సెంటర్ ను ప్రారంభించాడు. 9 నెలల శిక్షణ కోసం రూ.1.50 లక్షలను ఫీజుగా నిర్ణయించాడు. దీంతో 54 మంది విద్యార్థులు ఈ సంస్థలో చేరారు. ఓసారి నగదు సమకూరడంతో అతను రాత్రికిరాత్రే కోచింగ్ సెంటర్ ను మూసేసి పరారయ్యాడు. మరుసటి రోజు కోచింగ్ సెంటర్ కు వచ్చిన విద్యార్థులు మూసి ఉండటంతో నిర్వాహకుడైన రమణారెడ్డికి ఫోన్ చేశారు. అయితే ఫోన్ కలవకపోవడంతో రెండు, మూడు రోజులు ఎదురుచూశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పెనమలూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కేంద్రం వ్యూహంతోనే కుట్రలు



**రాజధాని వార్తలు, అమరావతి:** కేంద్ర ప్రభుత్వ వ్యూహంతోనే రాష్ట్రంలో కుట్రలు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరిగే అనేక నేరాలకు కేంద్రంలోని మోడీ సర్కార్ మద్దతు, ప్రోద్భలం ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో మరిన్ని మెరుపు నేరాలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చేప్పారు. కేంద్రం చెప్పినట్లుగా చేయలేమన్న ఆంధ్రప్రదేశ్ అధికారులను తొలగించి, ఉత్తరప్రదేశ్ నుంచి ఆదాయ పన్నుశాఖ (ఐటీ) అధికారులను రప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ప్రజావేదికలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై ఎస్పీలు, కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, దేశంలో ఏ రాజకీయ పార్టీ నాయకుడు ఎదుర్కోలేని సంక్షోభాలను తాను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కేంద్రం మరిన్ని కుట్రలకు పాల్పడే ప్రమాదం ఉందని, ఇందుకు అంతా మానసికంగా సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. అరాచక శక్తుల ఆగడాలకు కళ్లెం వేయాలన్నారు. కేంద్రం ఎన్ని కుయుక్తులు పన్నినా చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ గవర్నర్‌ల వ్యవస్థకు వ్యతిరేకమని చంద్రబాబు స్పష్టం చేశారు. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ కేంద్రానికి గూఢచారిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్‌పై జరిగిన దాడి విషయంలో స్పందించినంత వేగంగా తిత్లీ తుపానుపై ఎందుకు స్పందించలేదన్నారు. జగన్ దాడిపై డీజీపీకి గవర్నర్ ఫోన్ నేరుగా సీఎం, మంత్రులు, ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు రాజీపడకూడదన్నారు. సమర్థ పోలీసింగ్ లక్ష్యంగా పోలీసుశాఖ పని చేయాలని సూచించారు. పోలీసుశాఖకు అవసరమైన వాహనాల కొనుగోలుకు నిధులు అందిస్తామన్నారు.

**వనరులు సమకూర్చుకుంటున్నా...**

రాష్ట్రాభివృద్ధి కోసం సొంతంగా నిధులు సమకూర్చుకుంటున్నా కేంద్రం అడ్డంకులు కల్పిస్తోందని చంద్రబాబు విమర్శించారు. చివరకు అంతర్జాతీయ విమాన సర్వీసులకు సైతం అడ్డుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విమానాశ్రయాల విస్తరణ కోసం రూ.వెయ్యి కోట్ల విలువైన 750 ఎకరాల భూమినిచ్చినా, నాలుగేళ్లగా అంతర్జాతీయ సర్వీసులకు కుంటిసాకులు చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మూడోసారి ఐటీ దాడులు జరగటం పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్ర చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అలజడి సృష్టించటం ద్వారా పెట్టుబడిదారులలో భయాందోళన కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. న్యాయం కోరిన ప్రతిసారీ అణచివేసే ధోరణితో కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. చివరకు పవిత్ర తిరుమల క్షేత్రంలోనూ రాజకీయం చేయటం శోచనీయమన్నారు. ప్రతిపక్ష నేత జగన్‌ను అడ్డు పెట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. తాను లొంగకపోవటం వల్లే రాష్ట్రంపై కుట్రలు చేస్తోందని, జగన్‌పై దాడి అందులో భాగమేనని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ గరుడును తాను అంత సీరియస్‌గా తీసుకోలేదని, సినీ నటుడు శివాజీ చెప్పిన ఘటనలు వరుసగా జరుగుతున్నాయని చెప్పారు.

జగన్ పై హత్యాయత్నం కేసులో
## ఇద్దరు నిందితుల అరెస్టు

**రాజధాని వార్తలు, అమరావతి :** వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడు శ్రీనివాసరావు స్నేహితుడు గిడ్ల చైతన్య, లేఖ రాయడానికి సాయం చేసిన విజయలక్ష్మిలను నిన్న రాత్రి ముమ్మడివరం పోలీస్ స్టేషన్ నుంచి విశాఖకు తీసుకొచ్చారు. జగన్, శ్రీనివాసరావులు ఉన్న ఫ్లెక్సీల ఏర్పాటులో చైతన్య కీలక పాత్ర పోషించారు. తాజాగా శ్రీనివాసరావు జగన్ హత్యకు కుట్ర పన్నినట్లు వీరికి ముందుగానే తెలుసా? ఎన్నిరోజులు ప్లాన్ చేశారు? ఇంకా ఎవరెవరు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు? అనే కోణంలో అధికారులు నిందితులను విచారించనున్నారు.

**ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని అమరావతి వెల్ఫేర్ కౌన్సిల్ తీవ్రంగా ఖండిస్తూ సమగ్ర విచారణ జరిపి భాద్యులను శిక్షించాలని డిమాండ్ చేసింది.**

# కెరటాలపై ఆధిపత్యం

**భారతీయ మహిళలు శక్తిసంపన్నులు అందుకు తిరుగులేని ఉదాహరణ మహిళా నావికాదళం 254 రోజులపాటు ప్రపంచ యాత్ర సాగించిన ఆరుగురు మహిళలు. 550 నాటికల్ మైళ్లు సముద్రంలో ప్రయాణించి తామేమిటో నిరూపించుకున్నారు. అందులో ఒకరు విశాఖకు చెందిన పాతరపల్లి స్వాతి కూడా ఉన్నారు.**






ఆమె

ఆరుగురు మహిళా నౌకాదళ లెఫ్టినెంట్ కమాండర్లు వర్తికా జోషి, ప్రతిభా జంవాల్, పి.స్వాతి, ఎస్ విజయాదేవి, ఐశ్వర్య, పాయల్ గుప్తాలు గతేడాది సెప్టెంబర్ 10న తెరచాప పడవ సాయంతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణ అమెరికా, దక్షిణాఫ్రికా దేశాలతో పాటు అరేబియా, హిందూ, ఫసిపిక్, మహాసముద్రాలను ఈ ఏడాది మే 21 నాటికి చుట్టివచ్చి ఔరా.. అనిపించారు. ప్రపంచంలోనే ఏ మహిళా ఇటువంటి సాహసం చేయలేదని, తొమ్మిది మీటర్ల ఎత్తున ఎగసిపడే అలలు, 40 డిగ్రీల నుంచి 2 డిగ్రీల ఉష్ణోగ్రతలను హరికేన్ తుఫానులు లాంటి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని తాము ఈ పరిక్రమ కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించామన్నారు. మొత్తం 254 రోజుల పాటు తమ భూప్రదక్షిణ కొనసాగిందని, ఇందులో 194 రోజులు నడి సముద్రంలోనే గడిపామని వివరించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పడవ ంలోనే ప్రపంచాన్ని చుట్టొచ్చినట్లు చెప్పారు. భారత రక్షణ, విదేశీ శాఖల సాయం, నావికాదళ సిబ్బంది చొరవ వల్లనే తమ లక్ష్యం నెరవేరిందన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళితే ఎలాంటి లక్ష్యమైనా చేరువవుతుందని వారంతా నిరూపించారు.

విశాఖకు చెందిన పాతరపల్లి స్వాతి తండ్రి ఆది నారాయణ నావల్‌డాక్ యార్డు క్యాంటీన్‌లో పనిచేస్తుండగా, తల్లి రాణి ఎన్‌సీసీ శిక్షకురాలిగా పనిచేస్తోంది. ఆమెకు ముగ్గురు సోదరీలు ఉన్నారు. సైన్సు పోస్టుగ్రాడ్యుయేట్ అయిన స్వాతి అభ్యర్థుల పరీక్షలో నాలుగోస్థానంలో నిలిచి నౌకాదళంలో శిక్షణ పొందారు. 'పరిక్రమ' జర్నీలో నావిగేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థలను ఆమె నియంత్రించారు. తుపానులు, ఎగసిపడే అలలు,పెనుగాలలలో సమాచారవ్యవస్థను పరిరక్షించడం సవాలుతో కూడుకున్న పని. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా వారికి ఘన సత్కారం లభించడమే కాకుండా, ప్రధాని, రాష్ట్రపతులతో విందు ఆరగించే అవకాశం కూడా దక్కింది. ఇంతటి కార్యాన్ని సాధించడానికి రెండున్నరేళ్ల అతుల్ సిన్హా శిక్షణే కారణమన్న ఆమె ఇకపై ఎప్పుడు,ఎక్కడ నావికాదళానికి తన సేవ అవసరమైనా అక్కడ ఉంటానని ఆమె వెల్లడించారు.

**ఆలయాల్లోకి వెళ్లాలా..వద్దా వంటి కార్యక్రమాలతో కాలయాపన చేయకుండా, భూమి,సముద్రం, ఆకాశంలో తమ ఆధిపత్యాన్ని నిరూపించుకునే సాహసాలతో మహిళలు మరింత దూసుకు పోవాలని కోరుకుందాం.**

## కాలమ్

### ప్రపంచంలోనే విలువైన 8 గొప్ప పాఠాలు

**షేక్స్పియర్ :** ఇతరులభావాలతో ఆటలాడకు అలా చేయటం వలన నువ్వు ఆడిన ఆ ఆటలో గెలవచ్చు గాక కాని ఒక మంచి వ్యక్తిని నువ్వు జీవితాంతం కోల్పోతావు.

**నెపోలియన్ :** ఈ ప్రపంచం చాలా ఇబ్బందులను ఎదుర్కొంటుంది దానికి గల కారణం అశాంతిని రగిలించే చెడ్డ వ్యక్తులు కాదు మంచి వ్యక్తుల మౌనం

**ఐన్‌స్టీన్ :** నేను వారిపట్ల చాలా కృతజ్ఞడనై వున్నాను ఎవరయితే నన్ను నిరాకరించారో వారి వలనే నేను నా అంతట నేనుగా ఎదిగాను

**అబ్రహం లింకన్ :** నీలో స్నేహ గుణం అన్నది నీ బలహీనత అయితే ప్రపంచంలో నువ్వు అందరికన్నా బలమైనవాడివని అర్థం

**చార్లి చాప్లిన్ :** నవ్వుతూ తమ జీవితాన్ని కొనసాగిస్తున్నవారి జీవితాల్లో బాధలు వుండవు అని అనుకోవద్దు వారి వద్ద వాటిని ఎదుర్కొని నిలబడే తనం వలనే ఆ విధంగా తారసపడతారు

**విలియం అర్థర్ :** అవకాశాలు సూర్యకిరణాలు వంటివి అందుకే వాటిని వీలయినంత త్వరగా దొరకబుచ్చుకోవాలి. ఆలస్యం చేస్తే వాటిని కోల్పోక తప్పదు

**హిట్లర్ :** నువ్వు వెలుగులో వున్నంత కాలం నిన్ను అందరూ అనుసరిస్తారు. అదే నువ్వు చీకట్లో వుంటే నీ నీడ కూడా నీతో రాదు

**వివేకానంద :** నిశ్శబ్దముగా వుండు ఎందుకంటే నాణెము ధ్వని చేసినంతగా నోట్లు చేయవు విలువ కలిగినవి అలానే వుంటాయి.

## ఎస్ఆర్ఎంలో బీఎస్ఎన్ఎల్4జీ మేళా

- వర్సిటీ ప్రాంగణంలో 4జీ సేవలు
- నీరుకొండ, కురగల్లు గ్రామాలకూ 4జీ




**రాజధాని వార్తలు, అమరావతి :** నీరుకొండ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు మూడు రోజుల పాటు ప్రత్యేక 4జీ మేళాను నిర్వహించారు. గుంటూరు టెలికం డిస్ట్రిక్ట్ నుంచి వచ్చిన సబ్ డివిజినల్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, నాగరాజుల పర్యవేక్షణలో మేళా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. వర్సిటీ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవర్ ద్వారా విద్యార్థులు, ఉద్యోగులకు 4జీ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ నేపథ్యంలో మేళాను ఏర్పాటు చేసి ఆధార్ కార్డు గుర్తింపుతో ఆసక్తి గల వారికి 4జీ సిమ్‌లను ఉచితంగా అందజేశారు. యూనివర్సిటీకి చెందిన 350 మందికి పైగా ఉద్యోగులు, విద్యార్థులు సిమ్‌లను తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో రెండే చోట్ల బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తెచ్చిందనీ, ఎస్ఆర్ఎంలో ఏర్పాటు చేసిన 4జీ టవర్ రెండోదిగా పేర్కొన్నారు. ఎస్ఆర్ఎంలో ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థ వల్ల సమీపంలో ఉన్న నీరుకొండ, కురగల్లు గ్రామాలకు సైతం 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

## ఏఎన్‌యులో ప్రత్యేక పరిశోధన లాబ్ ఏర్పాటు




**రాజధాని వార్తలు, గుంటూరు :** దేశంలో అతితక్కువ ధరకే ఈసిజీ పరికరాలను అందించాలనే కృత నిశ్చయంతో స్విట్జర్లాండ్ దేశానికి చెందిన వెస్టర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య ఎన్. రికో స్టార్డర్ గారు ఏఎన్‌యులో ప్రత్యేక పరిశోధన లాబ్‌ని ఏర్పాటు చేయనున్నారు. 19 రోజుల భారత పర్యటనలో భాగంగా ఏఎన్‌యూలో లాబ్ నిర్మాణం చేపట్టనున్నారు. లాబ్ ఏర్పాటుకు తన వంతుకు ఆర్థిక సహాయంగా 3500 డాలర్ల ఖరీదైన పరికరాలను అందచేయనున్నారు. నేడు వైద్య పరీక్ష ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో వాటిని తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జె.ఎన్.టు.యూ కె కి సంబదించిన ప్రొఫెసర్ ప్రసాద్ గారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జాన్ పాల్ అదే విశ్వవిద్యాలయనికి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్ధయ్య, డీన్ ఆచార్య శ్రీనివాస్ రెడ్డి గారు, మరియు డాక్టర్.బి. నాగ కిశోరె తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన శస్త్రచికిత్స చేసిన జీజీహెచ్ వైద్యులు



**రాజధాని వార్తలు, గుంటూరు :** గుంటూరు జీజీ హెచ్ వైద్యులు మరోమారు అద్భుతాన్ని సృష్టించారు. రాష్ట్రంలో తొలి సారిగా కీ హోల్ పద్ధతిలో మెదడులో ఏర్పడిన ట్యూమర్‌ని తొలగించి రోగి ప్రాణాల్ని కాపాడారు. అయితే ఈ కీ హోల్ పద్ధతిలో వైద్యాన్ని నిర్వహించటానికి జీ జీ హెచ్ వైద్యులకి నలబై నిమిషాల సమయం పాటింది. నావిగేషన్ గైడెడ్ బైయసి ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడారు. రోగికి ఆ విభాగం అధిపతి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శేషాద్రి శేఖర్, హనుమ శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్‌లతో కూడిన వైద్యుల బృందం అత్యంత నైపుణ్యం తో విజయవంతంగా శాస్త్ర చికిత్స నిర్వహించారు.

## 2న ముస్లింల ఆత్మగౌరవ సభ



**రాజధాని వార్తలు, విజయవాడ :** ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన నవంబర్ 2న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న 'ముస్లిం ఆత్మగౌరవ సభ'కు డిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నేత, సీపీఐ జాతీయ కార్యవర్గ సభుడు కన్హయకుమార్ హాజరు కానున్నట్లు సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూఖ్ షుబ్లీ తెలిపారు. ముస్లింల దీనస్థితిని ప్రపంచానికి తెలియజేసేందుకు ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభకు కన్హయ్య కుమార్‌తోపాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్య దర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘు వీరారెడ్డి, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) హాజరవుతారని తెలిపారు. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లింలపై చిన్నచూపూ చూస్తున్నాయని షుబ్లీ ఆరోపించారు.** అనంతరం 'ముస్లిం ఆత్మగౌరవ సభ' పోస్టర్‌ను విడుదల చేశారు. ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సమీ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ఉలేమా విభాగం రాష్ట్ర ఇన్‌చార్జి మౌలానా హుస్పేన్, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే బాజీ, అబిద్‌ఖాన్, సిరాజ్ పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.5.06 కోట్లు

**రాజధాని వార్తలు, విజయవాడ :** దసరా ఉత్సవాలకు హుండీ ఆదాయం రూ.5.06 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను మూడు విడతల్లో లెక్కించగా... రూ.5.06 కోట్ల ఆదాయం వచ్చింది. మూడో విడత ఆదాయాన్ని శుక్రవారం లెక్కించగా రూ.2,09,67,571లు వచ్చింది. 292 గ్రాముల బంగారం, 7.350 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో అమ్మవారికి చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులతో పాటు దేవస్థానం సిబ్బంది ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు. దేవస్థానం ఈవో కోటేశ్వరమ్మ, ఛైర్మన్ గౌరంగబాబు ఆదాయం లెక్కింపును పర్యవేక్షించారు. నాలుగో విడత లెక్కింపు జరగనుంది.

## యువతి కిడ్నాప్ కలకలం

**రాజధాని వార్తలు, విజయవాడ:** విజయవాడలో యువతి కిడ్నాప్ కలకలం రేపుతోంది. నిడమానూరులో ఉంటున్న రేచల్ అనే యువతి అదృశ్యమవ్వగా ఆమె కుటుంబ సభ్యులు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది. బాలాజీ నగర్‌లోని ఓ కంపెనీలో రేచల్ మేనేజర్‌గా పనిచేస్తోందని, 25న కంపెనీకి వెళ్లిన రేచల్ ఇంతవరకూ ఇంటికి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఆ రోజు నుంచి రేచల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లోనే ఉందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. కంపెనీ ఎండీ విజయ్ పై తమకు అనుమానంగా ఉందని, అతనిని విచారిస్తే రేచల్ ఆచూకీ తెలిసే అవకాశం ఉందంటున్నారు.


## రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

**నీరుకొండ**
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### ఇతరములు

ఓం(శ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

### షాప్స్

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
విజయలక్ష్మి జనరల్ స్టోర్స్
మీకు కావలసిన నాణ్యమైన నిత్యావసర వస్తువులు
ఫోన్ : 94414 11432

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
న్యూఫేస్ క్లినిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

**విశాఖపట్నం**
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

**నీరుకొండ**
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755



## సీఆర్డీఏ అధికారులపై శ్రావణ్‌కుమార్ నిప్పులు



**రాజధాని వార్తలు, తుళ్ళూరు :** రాజధాని నిర్మాణం కోసం స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతుల సమస్యలను పరిష్క రించలేకపోతే ఆఫీసులను మూసుకోవాలంటూ తాడి కొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సీఆర్డీఏ అధికారులపై నిప్పులు చెరిగారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం మందడం సీఆర్డీఏ కార్యాలయంలో రైతుల సమస్యలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూములిచ్చిన రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేనప్పుడు విధులకు ఎందుకు హాజరవుతున్నారు, వెళ్లిపోవచ్చని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఎదుట రైతులు సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యాలయం చూట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం కానరాకపోవడంతో పోరాట బాట తప్పదని హెచ్చరించారు. అస్సైన్డ్ భూముల రైతులకు రెండేళ్లుగా కౌలు ఎందుకు ఇవ్వడం లేదని, వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. సర్వే ప్రకారం ఫ్లాట్లు ఎందుకు కేటాయించడంలేదని సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్‌ను ఎమ్మెల్యే నిలదీశారు. స్థానిక రైతులకు అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. డీకే పట్టాలున్న వారికి పూర్తి అన్యాయం జరిగిందని జెడ్పీటీసీ బెజవాడ నరేంద్రబాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందన లేదని ఎమ్మెల్యే ఎదుట విన్నవించారు. పూలింగ్‌కు మందడం గ్రామ పరిధిలో 32 ఎకరాల భూమి ఇస్తే ఐనవోలు గ్రామ పరిధిలో తనకు ఫ్లాట్లు కేటాయించారని, ఏ ఒక్క పాటు కూడా తూర్పు ముక్క కేటాయించలేదని ఆలూరి సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక అధి కారిని ఒకటి రెండు రోజులలో కేటాయిస్తామని సీఆర్డీఏ కమిషనర్ ఎమ్మెల్యేకు హామి ఇచ్చారు. కార్యక్రమంలో నూతక్కి కొండయ్య, ఆలూరి శ్రీనివాసరావు, మాదల శ్రీనివాసరావు, గడ్డం మారికటన్, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డేశారు.. కాలువ మరిచారు..!

- మురుగు నీటి తో ఇబ్బందులు
- దృష్టి సారించాలని స్థానికులు వేడుకోలు



**రాజధాని వార్తలు, రాయపూడి :** మంగళగిరి మండలం రాయపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డును నిర్మించి సైడ్ డ్రయినేజీ నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో మురుగు నీరు నిలిచి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనమిది. ముందుగా సైడ్‌డ్రెయిన్ నిర్మించి సిసి రోడ్డు వేస్తే ఇళ్లల్లో నుంచి వచ్చే మురికి నీరు కాలువల ద్వారా బయటకు పోయేది. అలా కాకుండా ముందుగానే సిసి రోడ్డు పనులు చేపట్టడంతో నీరంతా పక్కనే నిలిచిపోతుంది. నిలిచిన మురుగు నీటిలో దోమలు పెరిగి రాత్రివేళ కంటి మీద కునుకు కూడా ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిసి రోడ్డు వేయడం పట్ల స్థానిక ప్రజలు ప్రజలు హర్షం వ్యక్తం చేయాలో.. సైడ్‌డ్రెయిన్లు నిర్మించకుండా వదిలివేయడంతో మురుగునీటితో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల ఇక్కట్లకు జాలి పడాలో... అర్థం కాని పరిస్థితి నెలకొంది.

**అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు :**

పంచాయతీ అనాలోచిత నిర్ణయాలతో గ్రామంలోని ఎస్ సి కాలనీవాసులు సరి అయిన మురుగు కాలువలు లేక ఇబ్బందులపాలవుతున్నారని సైడ్ డ్రెయిన్లు నిర్మించకుండా రోడ్డును వేయడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సిసి రోడ్డు పక్కనే మురుగునీరు నిలువ ఉండటం కారణంగా రోడ్డు సైతం దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని... ఇప్పటికైనా మురుగు నీరు నిలువ ఉండకుండా వెంటనే ఎస్సీ కాలనీలో యుద్ధ ప్రాతిపదికన సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం చేపట్టి ఆరోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ఘల్లుమంది.. గ్లాసు..

**రాజధాని వార్తలు, గుంటూరు :** జిల్లాలో మద్యం అమ్మకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.. పల్లెల్లో బెల్టు షాపులు రెట్టింపు స్థాయిలో విస్తరిస్తున్నాయి... మద్యం దుకాణాల వేలంలో అవకాశం దక్కని వారంతా బెల్టు షాపుల ద్వారా అక్రమంగా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.. బాటిల్ ధర కంటే 5 నుంచి 10 శాతం అధికరంగా విక్రయిస్తున్నారు... నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా విస్తరిస్తున్నా.. పోలీసులు, అబ్కారీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.. యువత మద్యం మత్తులో జోగుతుంటే హానికర మైనటువంటి వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం రకరకాలుగా ప్రోత్సహిస్తున్నాయి. యువత పెడదోవ పట్టేందుకు ప్రేరేపించే మత్తు పానీయాలు వారి భవిష్యత్‌ను నట్టేట ముంచుతుందని తెలిసికూడా పబ్‌లకు, బార్‌లకు, కీడ్డిపార్టీలకు లైసెన్స్‌లు మంజూరు చేసి జీవితాలను నిర్వీర్యం చేస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా యువత మద్యం సేవిస్తున్న సంగతి విధితమే. చివరికి అలవాటు ఫ్యాషన్‌గా మారి కుటుంబాలను వీధిపాలు చేస్తున్నాయి. ప్రభుత్వాలు కొత్త కొత్త ఎక్సైజ్ పాలసీలను ప్రవేశపెట్టి దీంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమంటున్నారు. ఎక్కడ చూసినా తాగునీటి కొరత ఉంటుందేమో కానీ మద్యం మాత్రం ఎక్కడ కావాలంటే అక్కడ దొరుకుతుంది. తాగిన మైకంలో సమాజంలో గొడవలు, హత్యలు, దోపిడిలు, అఘాయిత్యాలు జరుగుతూ ఉన్నా ప్రభుత్వానికి ఇవేవి పట్టవు. దేశంలో జరుగుతున్న అనేక సంఘ వ్యతిరేక సంఘటనలకు కేంద్ర బిందువు మద్యమనే విషయం తెలిసి కూడా దానిపై వచ్చే ఆదాయంపై మక్కువతో యువతను చేతగానివారిని అశక్తులుగా మార్చుతున్నారు. ప్రజల జేబులకు చిల్లులు పెట్టి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టే ఇటువంటి ఎక్సైజ్ పాలసీలతో అభివృద్ధి లేకపోయినా ఫర్వాలేదు. ప్రజలను పస్తులతో పడుకోబెట్టే దౌర్భాగ్యస్థితికి మాత్రం తీసుకురావద్దని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజల సొమ్ము విగ్రహాల పాలు

- 31న పటేల్ విగ్రహావిష్కరణ
- రూ.3 వేల కోట్ల ఖర్చు
- స్థానిక రైతులకు సాగు నీరు కరవు

ప్రధాని మోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ భారీ విగ్రహం ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి. అదే రోజున గుజరాత్‌లో 182 అడుగుల పటేల్ భారీ విగ్రహాన్ని ప్రధాని మోడీ ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వం దీనికి ఐక్యతా విగ్రహమని పేరు పెట్టింది. దాదాపు మూడు వేల కోట్ల రూపాయలతో నర్మద నదీ తీరంలో ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహాన్ని ప్రపంచంలోనే ఎత్తైనదిగా భావిస్తున్నారు. స్వతంత్ర్య భారతదేశపు తొలి హెూంమంత్రి పటేల్. నర్మద జిల్లాలోని రైతులు మాత్రం తమ కష్టాలు తీర్చకుండా వేల కోట్ల రూపాయలు విగ్రహం కోసం ఖర్చు పెట్టడాన్ని తప్పు పడుతున్నారు.

**ఒక లక్షా నలభై వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు, రెండు వేల టన్నుల కాంస్యం, డెబ్భైవేల టన్నుల సిమెంటును ఇందులో వినియోగించారు. 'విగ్రహం వల్ల స్థానికులకు పరోక్షంగా, ప్రత్యక్షంగా ఆదాయం లభిస్తుంది. వారి ఆర్థికస్థితి మెరుగుపడుతుంది" అని సర్దార్ సరోవర్ నర్మదా నిగం జేఎండీ సందీప్ కుమార్ చెప్పారు. ఇప్పటికే ఎంతో గౌరవం, గుర్తింపు పొందిన వారి విగ్రహాలపై కోట్లు కుమ్మరించేకంటే, అణగారిన వర్గాల బతుకులను బాగు చేయడంపై దృష్టిపెడితే మంచిదని కొందరు అంటున్నారు.**

నర్మద నది సమీపంలో నివసించే రైతులు, ఇప్పటికీ తాము సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నట్లు చెబుతున్నారు. నానా పిపలియా గ్రామంలో మిరప పండించే రైతు ఒకరు మాట్లాడుతూ పటేల్ విగ్రహానికి, ఈ ఊరికి మధ్య దూరం 12 కిలోమీటర్లు. నర్మదకు దగ్గర్లోనే పొలం ఉన్నా పొలానికి సాగు నీరు అందడం లేదని వాపోయారు. 2013లో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి మోడీ నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ అది నెరవేరలేదన్నారు. గోరా గ్రామం పరిస్థితి కూడా అలాగే ఉంది. వీరి బాధలను బీబీసీ జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామని ఆయన అన్నారు. అయితే ప్రజల్లో మాత్రం పెద్దగా ఆశలు లేవు.




**స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న మహానుభావులు అని చెప్పకోవడానికి భారతీయ జనాతాపార్టీలో ఒక్కరు కూడా లేరు. దీంతో ఆ లోటును పూడ్చుకునేందుకు గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు, మొదటి హెూంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రధాని మోడీ ఎంచుకున్నారు. ఆయనకు చరిత్రలో అన్యాయం జరిగిందన్న పేరుతో ప్రపంచంలోనే అతిభారీ విగ్రహాన్ని రూ.3 వేల కోట్లతో నెలకొల్పి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆర్థికవేత్తలు, స్థానికులతోపాటు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.**




ఆదివాసులు, రైతుల హక్కుల కోసం పోరాడే లఖన్ మాట్లాడుతూ ఆమదాల, భదరవా, సంద్రోలీ వంటి గ్రామాలు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయన్నారు. గుజరాత్‌లోని మధ్యప్రాంతాలకు నీళ్లు అందుతాయి.. కానీ విగ్రహం చుట్టుపక్కల ప్రాంతంలో కనీసం 20 గ్రామాలకు నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఉందని వివరించారు.

భారతదేశ రాజకీయాలను ప్రభావితం చేసిన నెహ్రూ వంశం పట్ల పక్షపాతం వల్ల చరిత్రలో సర్దార్ పటేల్‌కు సముచిత స్థానం లభించలేదని చాలామంది హిందూ జాతీయవాదులు భావిస్తుంటారు. 'సర్దార్ పటేల్ తొలి ప్రధాని కాకపోవటం వల్ల ప్రతి భారతీయుడూ విచారం వ్యక్తం చేస్తున్నారు' అని 2013లో ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎన్నికల ప్రచారంలో మోడీ అన్నారు.

2014 ఎన్నికల్లో మోడీ విజయం సాధించిన తర్వాత ఈ విగ్రహం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ కంటే సర్దార్ పటేల్ విగ్రహం రెండు రెట్లు ఎత్తుగా ఉంది. పటేల్ విగ్రహం ఏర్పాటుతో ఈ ప్రాంతానికి పర్యాటకులు పెరుగుతారని ఆశిస్తున్నారు. అహ్మదాబాద్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. విగ్రహం మూడోవంతు ఎత్తులో.. ఛాతి భాగం లోపల ఒక గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహం తయారీకి 2500 మందికి పైగా కార్మికులు పనిచేశారు. చైనా నుంచి వచ్చిన వందల మంది వలస కార్మికులు కూడా తమ వంతు సాయం చేశారు.

– ఖాన్


విగ్రహం పనుల్ని పర్యవేక్షిస్తున్న గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ భాయ్ రూపానీ, ఉప ముఖ్యమంత్రి నితిన్ భాయ్ పటేల్

## విగ్రహం ప్రత్యేకతలు

**ఈ విగ్రహం ఎత్తు 182 మీటర్లు.. అంటే 600 అడుగులు. చైనాలోని 'స్ప్రింగ్ టెంపుల్ బుద్ధ' ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. దీని ఎత్తు 128 మీటర్లు. 1947లో భారతదేశానికి స్వతంత్రం లభించిన తర్వాత దేశ ఉప ప్రధానిగా పటేల్ పనిచేశారు. భారతదేశంలో కలిసేందుకు విముఖంగా ఉన్న, విభేదిస్తున్న పలు రాష్ట్రాలను జాతీయవాది అయిన పటేల్ ఒప్పించి, ఏకం చేసి భారతదేశంలో ఐక్యం చేసినందుకు.. ఆయన్ను భారత దేశ ఉక్కు మనిషి (ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా) అని కూడా పిలుస్తుంటారు.**







# ప్రధానే విభేదాలకు కారణం: చంద్రబాబు

**రాజధాని వార్తలు, ఢిల్లీ:** దేశంలోని రాజకీయ పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు హితవుపలికారు. స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే రాష్ట్రాలు, వ్యక్తుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగున్నరేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి చేసిన సాయంపైనా నిలదీసిన చంద్రబాబు.. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం కుట్రపూరిత వైఖరి అనుసరిస్తోందని ధ్వజమెత్తడంతో పాటు రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ మీడియాకు సీఎం వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "దేశంలో ఏం జరుగుతోందో వివరించడానికే మీ ముందుకొచ్చాను. రాష్ట్రంలో ఆర్థిక ప్రగతి తిరోగమనంలో ఉన్న పరిస్థితుల్లో మేం అధికారంలోకి వచ్చాం. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏపీలో ఒక్కసారిగా 19 ఐటీ బృందాలను దాడులకు పురిగొల్పారు. నల్లధనం వెనక్కి తీసుకొస్తామని కేంద్రం చెప్పింది. అలాంటిదేమీ ఏమీ జరగలేదు. ప్రతి ఒక్కరి బ్యాంక్ అకౌంట్‌లో నగదు జమచేస్తామన్నారు. డిజిటల్ ఎకానమీ ద్వారా అవినీతి తగ్గుతుందని నేను చెప్పాను. డిజిటల్ ఎకానమీ వల్ల ఫిజికల్ కరెన్సీ డిమాండ్ తక్కువగా ఉంటుంది.. పెద్ద నోట్లు రద్దుచేస్తామని రూ.2వేల నోట్లు తీసుకొచ్చారు. కానీ, నోట్ల రద్దుతో దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. నోట్ల రద్దు ఆలోచన సరైంది కాదు. సరైన ప్రణాళిక లేకుండా అమలుచేశారు. దేశంలో బ్యాంకులన్నీ స్థైర్యం కోల్పోయాయి. రూ.వేల కోట్లతో నీరవ్ మోదీ, జతిన్ మెహతా, నితిన్ సందేశ్రా దేశం విడిచి వెళ్లిపోయారు. ఆ తర్వాత జీఎస్టీని తీసుకొచ్చారు. 2006తో పోలిస్తే ఆర్థిక వృద్ధి రేటు ఆశించినంతగా లేదు. డాలర్‌తో రూపాయి మారకపు విలువ విపరీతంగా పెరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. ఎప్పుడు చేస్తారు? రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్రం చెప్పింది. ఎప్పుడు పూర్తి చేస్తారు? రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు.. ఎప్పుడు చేస్తారు? వ్యవసాయంలో 3శాతం వృద్ధి మాత్రమే ఉంది" అని చంద్రబాబు అన్నారు.



**విమానాశ్రయంలో దాడి కేంద్ర వైఫల్యమే**

"ఇటీవల విశాఖ విమానాశ్రయంలో ప్రతిపక్ష నేత జగన్‌పై దాడి జరిగింది. జగన్‌పై దాడి కేసు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్రం పరిధిలో ఉండే విమానాశ్రయంలో ఆ దాడి జరిగిన జరిగిన వెంటనే భాజపా నాయకులు తెదేపాపై విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఈ దాడిపై గవర్నర్ అధికారులను సంప్రదించారు. ప్రభుత్వాన్ని వివరాలు అడగాల్సిన గవర్నర్.. అధికారులను సంప్రదించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న విమానాశ్రయంలో దాడి జరిగితే మమ్మల్ని నిందిస్తే ఎలా? ఇది కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే" అని మండిపడ్డారు.






# పవన్‌కు ఛానళ్ల హోరు

**రాజధాని వార్తలు, అమరావతి :** వామపక్షాలకు చెందిన రెండు ఛానెళ్లను స్వంతం చేసుకున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఖాతాలో ఇంకో జాతీయ టీవీ ఛానల్ త్వరలో కలవబోతోందని వార్తలు వస్తున్నాయి. జనసేన నాయకుడు తోట చంద్రశేఖర్ సీపీఐ నేతల చేతుల్లో ఉన్న 99 టీవీ ఛానలును పవన్ పార్టీకి మద్దతుగా ఉండేందుకు కొనుగోలు చేశారు. అలా జనసేనకు పరోక్షంగా ఓ మీడియా చానల్ వచ్చింది. ఇది జరిగిన కొద్దికాలానికి మాజీ మంత్రి ముత్తాగోపాలకృష్ణ జనసేన గూటికి చేరారు. తద్వారా వారి చేతుల్లో ఆంధ్రప్రభ పత్రిక మద్దతు ఇస్తోంది. ఇక గౌతమ్ ఆధ్వర్యంలో ప్రారంభం అవుతున్న 'ఇండియా అహేడ్' ఇంగ్లీష్ న్యూస్ ఛానల్‌లో ఒక కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ హోస్టుగా రూపకల్పన చేశామని ఆ కార్యక్రమంలో చేయడానికి అంగీకరించాల్సిందిగా వారు కొద్దికాలం కిందట పవన్‌ను కోరగా ఈ టీవీషో చేయడానికి ఆయన అంగీకారం తెలిపారు. ప్రైమ్9 న్యూస్ పేరుతో పవన్‌పై ఉన్న వీరాభిమానంతో ఓ ఎన్నారై తన దగ్గరున్న డబ్బుతో ఈ ఛానెల్ పెట్టారు. ఇప్పటికే టెస్ట్ సిగ్నల్ మొదలైంది. దసరా నాడు టెస్ట్ సిగ్నల్ వచ్చిన ఈ ఛానల్ పవన్ కోసం ప్రత్యేకంగా కార్యక్రమం కూడా రూపొంది ంచినట్లు తెలుస్తోంది. జనసేన భావజా లాన్ని పెద్ద ఎత్తున చాటిచెప్పేందుకు ఈ ప్రోగ్రాంను ఉపయోగించుకోనున్నట్లు సమాచారం.








Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com